
సాక్షి ఒడిశా

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,80,740లు, బంగారం 5గ్రాము 500 మిల్లీగ్రాములు, వెండి 21 గ్రాములు 730 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బై.. బై.. గణేశా

వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగాయి.

- 8లో



ఘనంగా మిలాద్ ఉన్ నబి

మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

కొండచిలువ పట్టివేత



కొండచిలువతో స్నేక్ స్నాచర్ నాయక్

రాయగడ: స్థానిక అశోక్ నగర్ రెండో వీధిలో కొండచిలువ కలకలం రేపింది. గురువారం తెల్లవారుజామున వీధి బయట కనిపించిన కొండచిలువను చూసిన స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్నేక్ స్నాచర్ ప్రదీప్ కుమార్ నాయక్‌కు సమాచారం అందించగా అక్కడకు చేరుకున్న ఆయన చాకచక్యంతో పట్టుకొని, సమీప అడవుల్లో విడిచిపెట్టారు. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువ సుమారు 12 అడుగల పొడవు ఉంటుందని నాయక్ తెలియజేశారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతమవ్వాలి



మాట్లాడుతున్న పోలీసు అధికారి హరీష్

జయపురం: క్షేత్రస్థాయి నుంచి రెడ్‌క్రాస్ సేవలు విస్తృతమై ప్రజల సేవలో మమేకమవ్వాలని జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బి.సి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన బ్లాక్‌స్థాయి జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో జూనియర్ రెడ్‌క్రాస్ కేడర్ ఏర్పాటు జరిగితే, విపత్కర పరిస్థితిలో ప్రజలను ఆదుకోగలమని అభిప్రాయపడ్డారు. శిబిరంలో ప్రాథమిక చికిత్స, విపత్కర సమయాల్లో ప్రజలకు ఎలా సహకరించడం, ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడం తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. సాధన శిక్షకుడు హరేకృష్ణ మహరాణ మాట్లాడుతూ రెడ్‌క్రాస్, దాని బాధ్యతలను వివరించారు. జిల్లాలోని 7 కేంద్రాల్లో 12వ తేదీ నుంచి గురువారం వరకు శిక్షణ నిర్వహించినట్లు వెల్లడించారు. పాఠశాల హెచ్‌ఎం శ్యామ్ మెహర అధ్యక్షతన జరిగిన శిబిరంలో అదనపు బీడీవో మనోజ్ కుమార్ నాయిక్, జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి యజ్ఞేశ్వర పండ, రెడ్‌క్రాస్ సాధన వర్కర్లు శుభస్మిత సాహు, సుజిత్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

భూకంప జోన్‌లో 15 జిల్లాలు

భువనేశ్వర్: రాష్ట్రంలోని 15 జిల్లాలు భూకంప జోన్‌లో ఉన్నాయి. గురువారం జరిగిన శాసనసభ వర్షాకాలం సమావేశాలు పురస్కరించుకుని కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతి అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానమిస్తూ, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ మంత్రి సుదామ్ మరాండి ఈ విషయాన్ని తెలియజేశారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ), బిల్డింగ్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీ ప్రమోషన్ కౌన్సిల్ (బీఎంటీపీసీ), హౌసింగ్ మరియు పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ ప్రచురించిన భూకంప విపత్తుల జోనింగ్ అట్లాస్ ఆఫ్ ఇండియా (2016) సమాచారం మేరకు 15 జిల్లాలకు భూకంపం తాకిడి ప్రమాదం సంకేతాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. పూరీ, ఖుర్ధా, కేంద్రపడా, జగత్‌సింగ్‌పూర్, కటక్, జాజ్‌పూర్, ఢెంకనాల్, అంగుల్, దేవ్‌గడ్, సంబల్‌పూర్, బర్‌గడ్, ఝర్సుగుడ, సుందర్‌గడ్, బాలాసోర్ మరియు మయూర్‌భంజ్‌లు మోస్తరు భూకంపాలకు గురయ్యే (జోన్ 3) ప్రాంతాలుగా గుర్తించబడ్డాయని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పాఠశాల స్థాయిలో వివిధ కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అర్బన్ ఎర్త్‌క్వేక్ వల్నరబిలిటీ రిడక్షన్ ప్రోగ్రామ్ (యూఈవీఆర్‌పి) ద్వారా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా భూకంపాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. భూకంపాలను తట్టుకునే నిర్మాణాలకు సంబంధించి ఇంజినీర్లు మరియు మేస్త్రీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఇది కాకుండా విపత్తు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రాథమిక పాఠశాల పాఠ్యాంశాల్లో భూకంపం ఒక అంశంగా చేర్చబడిందని వివరించారు.

అలెర్ట్..!



- రాష్ట్రానికి భారీ వర్ష సూచన: ఐఎండీ
- అక్టోబర్ మొదటి వారంలో వర్షాలు
- పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ

భువనేశ్వర్:

మయన్మార్ మరియు దానికి ఆనుకొని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన వాయుగుండం తదుపరి 24 గంటల్లో తూర్పు మధ్య మరియు ఈ తీరానికి ఆనుకుని ఉన్న ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారుతుంది. దీంతో అక్టోబర్ నుంచి ఒడిశాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) గురువారం అంచనా సమాచారం జారీ చేసింది. అల్పపీడనం వెల్ మార్క్‌గా పరిణతి చెందిన తదుపరి 48 గంటల్లో ఉత్తర ఒడిశా మరియు దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరాల వైపు వాయువ్య దిశగా కదులుతుంది. దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయి.

● 29 నుంచి వర్షాలు

ఈనెల 29 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 1 నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. అక్టోబర్ 1న 11 జిల్లాలకు, అక్టోబర్ 2న 7 జిల్లాలకు 2 రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షపాతం కురుస్తుందని హెచ్చరిక జారీ చేయబడింది

● ఎల్లో అలెర్ట్

సెప్టెంబర్ 29న కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్ మరియు భద్రక్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల ఎల్లో హెచ్చరికతో వర్షం తీవ్రత క్రమంగా పెరుగుతుందని ఈ శాఖ తెలిపింది. సెప్టెంబర్ 30న, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, ఖుర్ధా, అంగుల్, ఢెంకనాల్, కెంజొహర్, మయూర్‌భంజ్, సుందర్‌గడ్, దేవగడ్ మరియు సంబల్‌పూర్‌లో ఒకటి లేదా రెండుచోట్ల భారీ వర్షపాతం (7 నుండి 11 సెంటీ మీటర్లు) కొనసాగే అవకాశం ఉంది. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బర్‌గఢ్, సంబల్‌పూర్, దేవగడ్, అంగుల్, ఢెంకనాల్, కెంజొహర్, మయూర్‌భంజ్, గంజాం, గజపతి, బౌధ్, సోన్‌పూర్, బొలంగీర్, కలహండి, కందమాల్, పూరీ ప్రాంతాల్లో ఒకటి, రెండు చోట్ల ఉరుములు, మెరుపులు తాండవిస్తాయని హెచ్చరిక జారీ చేయబడింది.

● ఆరెంజ్ అలెర్ట్

అక్టోబర్ 1న బర్‌గఢ్, సంబల్‌పూర్, దేవగడ్, ఝార్సుగుడ, సుందర్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్, సోన్‌పూర్, బొలంగీర్ మరియు అంగుల్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు (7 నుండి 20 సెంటీ మీటర్లు) కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. నువాపడా, నవరంగ్‌పూర్, కలహండి, కంధమల్, బౌధ్, కటక్, ఢెంకనాల్, జాజ్‌పూర్, భద్రక్ మరియు బాలాసోర్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షం (7 నుండి 11 సెం.మీ.) కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా అక్టోబర్ 2న నవరంగ్‌పూర్, నువాపడా, బొలంగీర్, కలహండి, బర్‌గడ్, ఝార్సుగుడ, సుందర్‌గఢ్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే సూచన ఉంది. మల్కన్‌గిరి, కొరాపుట్, కందమల్, బౌధ్, సోన్‌పూర్, సంబల్‌పూర్, దేవగడ్, కెంజొహర్, మయూర్‌భంజ్, అంగుల్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భూగర్భ మార్గాల్లో నీరు ప్రతిష్టంభన, వ్యవసాయ పొలాలు ముంపునకు గురికావడం, అప్పుడప్పుడు దృశ్యమానత తగ్గడం వల్ల పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ మరియు కచ్చా రోడ్లు మరియు ఇళ్లు దెబ్బతింటాయని కూడా హెచ్చరించింది. వ్యవసాయ క్షేత్రంలో ఎరువులు, రసాయనాల వాడకం వాయిదా వేయాలని మరియు పశువులను సురక్షిత ప్రదేశాలలో ఉంచాలని రైతులకు సూచించారు.

సకాలంలో టీకాలు వేయాలి



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ సింగ్ తదితరులు

రాయగడ: పెంపుడు కుక్కలకు సకాలంలో టీకాలు వేయాలని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ సూచించారు. ప్రపంచ జంతు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పశువైద్య కేంద్రంలో కుక్కలకు టీకాలు వేసే శిబిరాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు వంద కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీఎల్ఎన్ రాజు, జిల్లా పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ హడిబంధు భోయ్‌లు మాట్లాడుతూ.. జంతు వ్యాధుల నివారణ, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయకపోతే వచ్చే రోగాలు గురించి తెలియజేశారు. కలెక్టర్ సింగ్ మాట్లాడుతూ పశు వైద్య కేంద్రాలకు వచ్చినవారికి సకాలంలో సేవలు అందించాలని అన్నారు. అలాగే జిల్లా కేంద్రాస్పత్రిలో కుక్కకాటుకు సంబంధించిన టీకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ బిప్రచరణ్ బెహర, డాక్టర్ బీరంచి నారాయణ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.



కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న చంద్రశేఖర మఝి తదితరులు

జయపురం: ఎస్సీ, ఎస్టీ వర్గాల పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కొరాపుట్ జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర మఝి పిలుపునిచ్చారు. కోట్‌పాడ్ జాతీయ రహదారి కూడలి వద్దనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'అజి అమె జనిబ, అమె జినిబ(నేడు మనం తెలుసుకుందాం, మనం గెలుచుకుందాం)' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఆదివాసీ, హరిజన విద్యార్థుల ప్రగతికి అమలు చేస్తున్న పథకాలు వివరించారు. పిల్లలు విద్యావంతులైతేనే సమాజంలో మార్పు సాధించవచ్చని పేర్కొన్నారు. కోట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్ఏసీ) చైర్‌పర్సన్ ఎం.శంకరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం సుశ్రీ ప్రమీల పూజారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎండీ పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు పరశురాం సమరత్, డీఆర్ గోవింద చరణ శెట్టి, ఉపాధ్యాయులు మనోజ్ దాస్, ప్రతలభ పాణిగ్రహి, రీణా బెహర, ఇతిలష్మ సాహు, ఉమేష్ చంద్ర బిసాయి, సమితి సంక్షేమ అధికారి ఆకాశ కుమార్ జెన తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణపై దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

- 36 లక్షల మందికి ఔషధాల పంపిణీ లక్ష్యం
- కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా

బరంపురం: గంజాం జిల్లాలో పూర్తిస్థాయిలో ఫైలేరియా నివారణపై దృష్టి సారించినట్లు కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా తెలియజేశారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధి నిరోధక ఔషధాల పంపిణీపై సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జీరో బాధితుల లక్ష్యంగా 36 లక్షల మందికి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఈ వ్యాధి విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. జిల్లాలోని 16 ఎన్ఏసీలు, 22 బ్లాక్‌లు, ఒక మున్సిపాలిటీ పరిధిలోని 475 పంచాయతీ గ్రామాల్లో ప్రతి ఇంటికీ డీఈసీ మరియు అర్బండోజ్ మాత్రలు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. దీనికోసం 7,050 ఆశ కార్యకర్తలు, 705 మంది సూపర్‌వైజర్స్ పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ, ఎస్ఎస్‌జీ, ఎన్‌జీవో తదితర సంస్థల సహకారం తీసుకుంటామన్నారు. దీని కోసం ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మందులు వాడడం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని స్పష్టం చేశారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, బ్యానర్లు, లీఫ్‌లెట్స్ ద్వారా చైతన్యపరుస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ అధికారి సదానంద్ మిశ్రా, ఏసీడీఎం ఆర్.జగదీశ్వర్ పట్నాయక్, డీపీఎం శ్యామ్ సుందర్ త్రిపాఠి, డీఎంఆర్‌హెచ్ ఆశిష్ కుమార్ మహంతి, వైద్యురాలు తప్తిలతా మహాపాత్రో పాల్గొన్నారు.

శాసనసభలో ఎమ్మెల్యే ప్రదీప్ పాణిగ్రాహి ధర్నా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో గురువారం గందరగోళ దృశ్యాలు చోటుచేసుకున్నాయి. గంజాం జిల్లా గోపాల్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రదీప్ పాణిగ్రాహి రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆయన అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) బహిష్కృత ఎమ్మెల్యే, మాజీ మంత్రి. సభలో తనకు ప్రశ్నలు అడిగే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. తనను ఏ ప్రశ్నను లేవనెత్తడానికి అనుమతించడం లేదని పేర్కొంటూ, స్పీకర్ పోడియం ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. స్పీకర్ ప్రమీలా మల్లిక్ విజ్ఞప్తి మేరకు పాణిగ్రాహి ధర్నా విరమించి అక్కడ నుంచి తొలగిపోయారు.

వాహనాలను తగలబెట్టిన దుండగులు



దగ్ధమైన ద్విచక్ర వాహనాలు

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి టికిరిలోని స్పందన, ఫ్యూజన్ అనే రెండు ఫైనాన్స్ కంపెనీల కార్యాలయం వద్ద 12 వాహనాలను గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ మేరకు ఆయా కంపెనీల మేనేజర్లు విక్రం పురోహిత్, శ్యాం బంధు మహాపాత్రోలు టికిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి టికిరిలోని ఆదివాసీ వీధిలో ఉన్నటువంటి స్పందన, ఫ్యూజన్ కంపెనీలకు చెందిన సిబ్బంది ద్విచక్ర వాహనాలను కార్యాలయం కింద ఉంచారు. ఈ సమయంలో కింద అంతస్తులో పడుకుని ఉన్న కొంతమంది సిబ్బంది గదులకు బయట నుంచి గడియ పెట్టిన దుండగులు, వాహనాలను తగులబెట్టారు. కొద్ది సమయానికి దట్టమైన పొగలు అలుముకుని గదిలోకి పొగ వ్యాపించడంతో బయటకు వచ్చేందుకు ప్రయత్నించినా సాధ్యమవ్వలేదు. దీంతో పైఅంతస్తులో ఉన్నటువంటి తోటి సిబ్బందికి ఫోన్ చేశారు. వారు లేచి గడియ పెట్టి ఉన్న తలుపులను తెరిచారు. అయితే అప్పటికే వాహనాలు అన్ని పూర్తిగా కాలిపోయాయి. ఈ దారుణానికి పాల్పడింది ఎవరో తెలియడం లేదు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

- అక్టోబర్ 2 నుంచి విస్తృతంగా ప్రచారాలు
- పలు జిల్లాల్లో అవగాహన బ్రోచర్ల ఆవిష్కరణ



పర్లాకిమిడి: బ్రోచర్ విడుదల చేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తదితరులు

రాయగడ:

పెరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఒక అడుగు ముందుకు వేసింది. ఈ క్రమంలో స్థానిక డీఆర్‌డీఏ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో అధ్యక్షతన సైబర్ సేఫ్టీ క్యాంపెయిన్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ వివేకానంద శర్మ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సరైన అవగాహన లేకపోవడంతోనే సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు తగు చర్యలు చేపడుతోందని తెలియజేశారు. మొబైల్, డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాలు, ఆన్‌లైన్ చెల్లింపుల్లో ప్రజలను మోసగించేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతమవ్వాలంటే అందరి సహకారం అవసరమన్నారు.

అక్టోబర్ 2 నుంచి చైతన్య కార్యక్రమాలు

సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎస్పీ శర్మ తెలియజేశారు. తాము చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమవ్వాలంటే స్వచ్ఛంద సంస్థలు, ఆశ, అంగన్‌వాడీ, మిషన్ శక్తి తదితర సంస్థలకు చెందిన ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ముఖ్యంగా ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు.

విస్తృతంగా ప్రచారం

సైబర్ నేరాలను ఎలా అరికట్టాలనే అంశానికి సంబంధించి సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేపట్టేందుకు పోలీసు యంత్రాంగం సన్నాహాలు చేస్తోందన్నారు. సైబర్ నేరాలపై అవగాహనకు సంబంధించి 24 వీడియోలను ఇప్పటికే సిద్ధం చేశామని వివరించారు. వీటిని ప్రతీ గ్రామంలో ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచేలా చేస్తామని తెలియజేశారు. అలాగే బహిరంగ ప్రదేశాలు, సంతలు తదితర జన సందడి ప్రాంతాల్లో తమ సిబ్బంది ఇటువంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తారని వెల్లడించారు. సైబర్ మోసాన్ని ఛేదించేందుకు 1930 టోల్ ఫ్రీ నంబర్‌తో సేవలు అందే ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంతకుముందు సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తత తదితర అంశాలకు చెందిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ బిజయ్ కుమార్ నాయక్, డీఎస్పీ ప్రతాప్ చంద్ర త్రిపాఠి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: రాష్ట్రంలో అనేక మంది ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని, దీంతో ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు అక్టోబర్ 2వ తేదీ నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తెలియజేశారు. స్థానిక 3వ రిజర్వుడ్ పోలీసు బెటాలియన్ కార్యాలయంలో సైబర్ సేఫ్టీ క్యాంపెయిన్ పేరిట బ్రోచర్, లోగోను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా అన్ని సమితి కేంద్రాలు, మున్సిపల్, ఎన్ఏసీ పరిధిలో కళాశాలలు, విద్యాలయాల్లో క్విజ్ పోటీలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాలు ప్రచురించాలని కోరారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ ప్రచారం కోసం మాస్కట్‌ను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ఆవిష్కరించారు. సైబర్ నేరగాళ్ల దాడుల వలన 2020–21లో గజపతి జిల్లాలో 124 కేసులు, 2022లో 21 కేసులు, 2023లో 20 కేసులు నమోదైనట్లు వెల్లడించారు.



రాయగడ: అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ శర్మ, ఏఎస్పీ పాత్రో తదితరులు




మల్కన్‌గిరి: మాట్లాడుతున్న ఎస్పీ నితీష్ వాధ్వానీ

మల్కన్‌గిరి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నితీష్ వాధ్వానీ ఆధ్వర్యంలో సైబర్ సేఫ్టీ క్యాంపెయిన్ సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం సైబర్ మోసాలు వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఇకపై రాష్ట్రంలో వీటిని అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 80 సైబర్ కేసులు నమోదయ్యాయని తెలియజేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

డాక్టర్ స్వామినాథన్ మృతికి సంతాపం



పూరీ బీచ్‌లో స్వామినాథన్ సైకత శిల్పం ఆవిష్కరించిన సుదర్శన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతిపై రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌లు గురువారం సంతాపం తెలిపారు. భారతదేశంలో హరిత విప్లవ పితామహుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. భారతదేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చేయడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. ఒడిశాతో స్వామినాథన్‌కు ఉన్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఒడిశాలో తన తొలినాళ్ల పరిశోధనను ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలోని రైతులకు అన్ని విధాలుగా సాయం చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవారన్నారు. ఒడిశాలోని గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ కార్యకలాపాలను మెరుగుపరచడంలో అతని ఫౌండేషన్ అమూల్య సేవలను అందించిందని కొనియాడారు. ఆయన మరణం వ్యవసాయ విజ్ఞాన రంగానికి తీరని లోటన్నారు.

సహకార రంగంలో అవకతవకలు

- సభలో అంగీకరించిన ప్రభుత్వం

భువనేశ్వర్: కేంద్ర, రాష్ట్ర మరియు పట్టణ సహకార బ్యాంకులు మరియు ఇతర ఏజెన్సీలకు సంబంధించిన సహకార రంగంలో రూ.3,579.81 లక్షల ఆర్థిక అవకతవకలను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఖండపడా నియోజకవర్గం ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ సహకార శాఖ మంత్రి అటును సవ్యసాచి నాయక్ అసెంబ్లీకి తెలిపారు. రాష్ట్ర మరియు కేంద్ర సహకార బ్యాంకుల్లో మోసం మొత్తం రూ.1,733.96 లక్షలు కాగా, అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకుల్లో అక్రమాలు రూ.1,845.85 లక్షలుగా ఉన్నాయన్నారు. 2018 సంవత్సరం నుంచి ఇప్పటివరకు అక్రమాలు జరిగాయని తెలిపారు. ఒడిశా కో–ఆపరేటివ్ సొసైటీస్ చట్టం–1962 నిబంధనల ప్రకారం రుణం మరియు ఇతర ఆర్థిక అవకతవకలను తెలుసుకోవడానికి వార్షిక మరియు ప్రత్యేక ఆడిట్‌లు నిర్వహించబడతాయన్నారు. ఆడిట్ సమయంలో మోసం మొత్తం మరియు ఇతర వివరాలు వెల్లడైనట్లు మంత్రి వివరించారు. నిర్దిష్ట సాక్ష్యాధారాలు ఆధారంగా మోసానికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు ప్రారంభమవుతాయన్నారు. ఒడిశా కో–ఆపరేటివ్ సొసైటీస్ చట్టం–1962లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం వారిపై కూడా చర్యలు తీసుకోబడతాయి. అవసరమైతే వారిపై కోర్టులో సివిల్ కేసు దాఖలు చేయబడతాయని మంత్రి తెలిపారు.

ట్రామా ఎమర్జెన్సీపై 108 ఉద్యోగులకు శిక్షణ

పలాస: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 108 డివిజన్ స్థాయి సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరి ప్రసాద్, పలాస ఆపరేషన్ ఎగ్జిగ్యూటివ్ గండేటి జగన్ పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. అత్యధికంగా జిల్లాలో జాతీయ రహదారి, రాష్ట్ర స్థాయి, సబ్, పట్టణ రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు(ట్రామ ఎమర్జెన్సీస్), ఎయిర్‌వే మేనేజ్‌మెంట్, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాల గురించి సమీక్ష తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పలాస డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఈయంటి పాతాళ సత్యం, బత్తిని తారక్, ఉప్పాడ గోపాలకృష్ణ, అవుగాన నారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు



టెక్కలిలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికల్లో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, నెట్ బాల్, రగ్బీ, రూప్ స్కిప్పింగ్ తదితర క్రీడల ఎంపికలకు 125 పాఠశాలల నుంచి సుమారు 650 మంది బాల బాలికలు హాజరయ్యారు. వివిధ క్రీడల్లో నిర్వహించిన ఎంపికల్లో ఉల్లాసంగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించారు. ఇందులో ఎంపికైన వారంతా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని మీట్ ఆర్గనైజర్ బి.నారాయణరావు వెల్లడించారు. పీడీలు వై.శేఖర్‌బాబు, పి.తిరుపతిరావు, జి.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, కె.ప్రకాశ్, రాజా, రమణ, వాసుదేవరావు, పావని, దివ్యవాణి, నాగరాజు, ఉష, ఆదిశేషు రఘునాథరావు తదితరులు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

బై.. బై.. గణేశా

వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల లడ్డూ వేలం పాటలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనోత్సవాల్లో యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: ఉత్సాహంతో నృత్యాలు చేస్తున్న ప్రజలు


జయపురం: పూజా మండపంలో వేద పండితులను సన్మానిస్తున్న దృశ్యం


జయపురం: బొరిగుమ్మలో వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న సభ్యులు


జయపురం: నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు


పర్లాకిమిడి: కేరింతలు కొడుతున్న యువత


పర్లాకిమిడి: జంగంవీధి లక్ష్మీ గణపతి నిమజ్జనం

ఘనంగా మిలాద్ ఉన్ నబి

మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మసీదుల్లో ప్రార్థనలు చేశారు. ముస్లిం పతాకాలతో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మత గురువులు మహ్మద్ ప్రవక్త కోసం ప్రసంగించారు.

– సాక్షి నెట్‌వర్క్


జయపురం: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


బరంపురం: ప్రార్థన మసీద్‌కు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


బరంపురం: బెరక్స్ పడియాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం


రాయగడ: ర్యాలీలో ఆకర్షణగా నిలిచిన మసీద్ నమూనాలు


రాయగడ: ర్యాలీలో పాల్గొన్న మత పెద్దలు


రాయగడ: పట్టణంలో భారీగా ర్యాలీ

సీఎం ప్రకటనపై మండిపాటు


అసెంబ్లీ బయట మాట్లాడుతున్న జయ నారాయణ మిశ్రా

భువనేశ్వర్: ప్రజల అభియోగాల విచారణ పురస్కరించుకొని 5టీ కార్యదర్శి రాష్ట్రవ్యాప్త పర్యటనల గురించి సీఎం నవీన్ పట్నాయక్ శాసనసభలో చేసిన ప్రకటనపై ప్రతిపక్ష నేత, బీజేపీ సభ్యుడు జయ నారాయణ మిశ్రా మండిపడ్డారు. అసెంబ్లీ వెలుపల గురువారం ఆయన మాట్లాడుతూ.. బ్యూరోక్రాట్ హెలికాప్టర్ సందర్శనలకు ఖర్చు చేసిన డబ్బు వివరాలపై ఎవరూ సమాధానం కోరలేదన్నారు. గత మూడున్నరేళ్లలో హెలికాప్టర్ సందర్శనల కోసం రూ.40 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారని, అయితే భద్రతా ఏర్పాట్లు, టెంట్లు, జన సమీకరణకు చేసిన ఖర్చు గురించి సమాచారం లేదన్నారు. ఒక ఎమ్మెల్యే వివాహానికి, మరొక ఎమ్మెల్యే తండ్రి 11వ రోజు కార్యక్రమానికి హాజరయ్యేందుకు 5టీ కార్యదర్శి హెలికాప్టర్‌ను ఉపయోగించారని పేర్కొన్నారు. వీటికి కారణం తెలియజేయాలని డిమాండ్ చేశారు. మంత్రి ప్రదీప్ కుమార్ ఆమత్ పేరుతో బుక్ చేసిన హెలికాప్టర్‌ను కటక్‌కు సందర్శనకు 5టీ కార్యదర్శి ఉపయోగించారన్నారు. అలాగే స్థానిక దిగువ పీఎంజీ వద్ద తమ డిమాండ్లను లేవనెత్తుతూ వివిధ సంఘాలు నిర్వహిస్తున్న ప్రదర్శనలపై కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత నరసింగ మిశ్రా అదే తరహాలో ప్రభుత్వంపై మండిపడ్డా రు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అనేక జిల్లాలకు సీఎంవో వెళుతోందని అసెంబ్లీలో ప్రభుత్వం చెప్పింది. అయితే రాష్ట్ర రాజధానిలో చాలా మంది ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. రాజధాని నగరంలోని దిగువ పీఎంజీ వద్ద ప్రజల కష్టాలను సీఎంవో ఎందుకు వినడం లేదని ప్రశ్నించారు.

ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్


డాక్టర్ ముఖేష్ మహాలింగ్


మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్‌ను అగౌరవ పరిచినందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో మోహన్ చరణ్ మాఝీ, డాక్టర్ ముఖేష్ మహాలింగ్ ఉన్నారు. వీరిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసినట్లు స్పీకర్ ప్రమీలా మల్లిక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్షాకాల సమావేశాలు ముగిసేవరకు ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతలను మాట్లాడనివ్వడం లేదని ఆరోపిస్తూ బీజేపీ సభ్యులు తొలుత సభ వెల్‌లోకి దూసుకెళ్లి అలజడి రేపారు. ఆ తర్వాత ప్రతిపక్ష చీఫ్ విప్‌గా ఉన్న మోహన్ మాఝీ, ఆయన శాసన సభ సహచరుడు మహాలింగ్ స్పీకర్ పోడియంపైకి పప్పు విసిరినందుకు సస్పెన్షన్ వేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను ముఖేష్ మహాలింగ్ తోసిపుచ్చారు. తాము పప్పుని స్పీకర్‌కి అందించామన్నారు. సభ ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం లేదన్నారు.

ఐటీడీఏ ఏర్పాటుకు సానుకూల స్పందన

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఏపీ అసెంబ్లీ సభ్యుల షెడ్యూల్డ్ తెగల కమిటీ సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టిలో ఐటీడీఏ కేంద్రంతో పాటు, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభ్యుల షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ సానుకూలంగా స్పందించిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న షెడ్యూల్డ్ తెగల కమిటీ సమావేశ మందిరంలో గురువారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభ్యుల షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ సమావేశం జరిగినట్లు ఆమె తెలిపారు. కమిటీలో సభ్యురాలిగా జిల్లాలోని గిరిజనుల ఆకాంక్షలను తెలిపానని చెప్పారు. సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోవడంతో శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని వివరించానని తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, సమీపంలో ఉన్న సారవకోట, మందస, సరుబుజ్జిలి తదితర ప్రాంతాల్లోని గిరిజనులకు అందుబాటులో ఉన్న మెళియాపుట్టి ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే గిరిజన బాలికలు 10వ తరగతి తర్వాత చదువు మానేస్తున్నారని, వారి కోసం పాతపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరానని చెప్పారు. ఈ విషయమై గతంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించానని తెలిపానన్నారు. కమిటీ సభ్యులు కూడా సానుకూలంగా స్పందించారని, పాతపట్నం నియోజకవర్గం గిరిజనులకు త్వరలో మంచి కబురు వస్తుందన్నారు.

శ్రీకాకుళంలో సదరన్ ట్రావెల్స్ సేవలు


కొత్త బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, తదితరులు

- పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభం
- జిల్లా నుంచి దేశ, విదేశాలకు సేవలు


కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవంలో అతిథులు

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: ప్రముఖ ట్రావెల్స్ సంస్థ సదరన్ ట్రావెల్స్ శ్రీకాకుళంలో కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించింది. శ్రీకాకుళంలోని విశాఖ కాలనీ సమీపంలో రామలక్ష్మణ్ జంక్షన్ ఆర్‌ఎస్ దేవి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని గురువారం ప్రారంభించారు. దక్షిణ భారతదేశం నుంచి వేలాది మంది ప్రయాణికులు సదరన్ ట్రావెల్స్‌పై విశ్వసనీయమైన నమ్మకాన్ని కలిగి ఉన్నారని అతిథులు ప్రశంసించారు. శ్రీకాకుళంలో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేయడం సంతోషకరమని, కొత్త బ్రాంచ్ ద్వారా అత్యున్నత స్థాయి ప్రమాణాలు గల సేవలను అందిస్తామని సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి కృష్ణ మోహన్ తెలిపారు. దేశ విదేశాల్లో ఫ్లైట్ బుకింగులు, హాలిడే ప్యాకేజీలు, ప్రపంచ వ్యాప్తంగా హోటల్ రిజర్వేషన్లు, వీసా సేవలను శ్రీకాకుళం నుంచి కూడా అందజేస్తామని వివరించారు. ఈ ట్రావెల్స్ ద్వారా యూరప్, దుబాయ్, థాయ్‌లాండ్, వియత్నాం, సింగపూర్, మలేషియాతో పాటు మాల్దీవులకు వెళ్లడానికి సేవలు అందజేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే ఛార్‌ధామ్, వారణాశి, వైష్ణోదేవి, గోవా, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, డార్జిలింగ్, కశ్మీర్ వంటి దేశీయ పర్యాటకానికి సదరన్ ట్రావెల్స్ సేవలు అందజేస్తుందని వెల్లడించారు. 1500 కు పైగా ట్రావెల్ ప్యాకేజీలతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సదరన్ ట్రావెల్స్ సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు ఆర్య వైశ్య మహాసభ వైస్ ప్రెసిడెంట్ తమ్మన్న భాస్కర్, పీఎస్‌ఆర్ గ్రూప్ చైర్మన్ పూన సర్వేశ్వ్రరావు, సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

1న స్కూల్‌గేమ్స్ రోల్‌బాల్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ రోల్‌బాల్ ఎంపిక పోటీలు అక్టోబర్ ఒకటో తేదీన జరగనున్నాయని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జిల్లాలోని పలాస ఉన్న స్కేటింగ్ రింక్‌లో అండర్–14, అండర్–17, అండర్–19 బాలబాలికల ఎంపికలు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను త్వరలో జరిగే రాష్ట్రపోటీలకు పంపించనున్నట్లు చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9290905399, 9705462218 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

నూతన పోలింగ్ కేంద్రాల పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం ఉదయం పరిశీలించారు. స్థానిక సీఎస్ఎస్ఎం స్కూల్‌లో కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ నంబర్ 263, 264, 265లను ఆయన స్వయంగా పరిశీలించి ఆర్డీఓ, ఎమ్మార్వోలకు తగు సూచనలు ఇచ్చారు. గతంలో ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో మూడు కేంద్రాలను ఓటర్ల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా బూత్‌లలో సీలింగ్, పవర్ సప్లై, కిటికీలను, గది వైశాల్యాన్ని కొలతలు వేసి నివేదిక సమర్పించాలన్నారు. అలాగే ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూలు, చౌదరి సత్యనారాయణ కాలనీలో నూతన ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు ఉన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు ఖరారు


జిల్లా సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్, రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ బాస్కెట్ బాల్ జట్లు ఖరారయ్యాయి. శ్రీకాకుళం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సీనియర్స్ పురుషులు, మహిళల జట్లను ప్రకటించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానంలో గత పది రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరాల అనంతరం క్రీడాకారుల రాణింపు ఆధారంగా తుది జట్లను ప్రకటించడం జరిగిందని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి, డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావు రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ జట్లు గురువారం సాయంత్రం పోటీలకు మార్టూరుకు బయల్దేరి వెళ్లాయి.

జిల్లా జట్ల వివరాలు

పురుషుల జట్టు: సీహెచ్ గణేష్ (కెప్టెన్), బి.నవీన్, ఐ.సంతోష్, ఎ.అశోక్, కె.జయకృష్ణ, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎ.అజయ్, పి.లీలాప్రసాద్, ఐ.భార్గవ్, ఎం.కార్తీక్, పి.ప్రద్యుమాన్, పి.నవీన్. స్టాండ్‌బైగా ఎం.జశ్వంత్, డీఎస్‌డీఎస్ పట్నాయక్.

మహిళల జట్టు: డి.దుర్గాప్రశాంతి (కెప్టెన్), ఎండీ హఫీజ, ఎస్.పద్మశ్రీ, ఎస్.ప్రేమశ్రీ, పి.కళ్యాణి, బి.స్పందన, ఎం.మౌనిక, ఎల్.ప్రమీల, ఎస్.సురేఖ, పి.శ్రావణి, డి.హిమకళ్యాణి, అక్షయ ఎంపికయ్యారు. ఈ జట్లకు కోచ్‌గా జి.అర్జున్‌రావురెడ్డి, మేనేజర్‌గా హమీద్ వ్యవహరించనున్నారు.

క్లుప్తంగా

గొల్లాదిలో విషాదఛాయలు



తల్లి,తమ్ముడ్ని పోగొట్టుకున్న బాధతో భోరున ఏడుస్తున్న దివ్యను ఓదారుస్తున్న బంధువులు

బాదంగి: మండలంలోని గొల్లాదిగ్రామానికి చెందిన వలస కూలీ నాయుడు అప్పన్న భార్య మంగమ్మ, కుమారుడు నవీన్‌లు చెన్నైలో జరిగిన రైలుప్రమాదంలో చనిపోవడంతో అనాథలుగా మారిపోయామని తండ్రీకూతుళ్లు అప్పన్న, దివ్యలు భోరున విలపించారు. నవీన్ మృతదేహం గురువారం గ్రామానికి చేరుకోవడంతో తండ్రీకూతుళ్లను బంధువులు ఎంతగా ఓదార్చినప్పటికీ బాధను అణుచుకోలేక కంటికీమింటికీ ఏకధారగా రోదించారు. మంగమ్మకు ముందురోజు అంత్యక్రియలు జరగ్గా, నవీన్ మృతదేహానికి గురువారం అంత్యక్రియలు జరగడంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉంది. నవీన్ మృతదేహం గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులంతా అధిక సంఖ్యలో పరుగులుపెడుతూ అక్కడికి చేరుకుని చివరిసారిగా బాలుడ్ని చూసి ఎంతభవిష్యత్ ఉన్నవాడో ఇలాఅయి పోయాడంటూ సానుభూతి వ్యక్తం చేశారు. తండ్రి అప్పన్న ఇదేమి ఖర్మరా అంటూ చేసేదిలేక కుమారుడికి దహనసంస్కారాలు పూర్తిచేశాడు.

చింతపల్లిలో దొంగల బీభత్సం

- అడ్డుకున్న తల్లీకొడుకులపై దాడి



చింతపల్లిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి గ్రామంలో సినీ ఫక్కీలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన మొంగం ప్రమీల, కుమారుడు మూర్తి నిద్రిస్తున్న సమయంలో ముగ్గురు దుండగులు బుధవారం అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించారు. ప్రమీల దాచుకున్న హుండీని దొంగిలిస్తున్న సమయంలో ఆమె మేల్కొనడంతో దాడిచేశారు. అదే సమయంలో కుమారుడు కూడా నిద్ర మేల్కొనడంతో కర్రలు, ఇంట్లో సామగ్రితో దాడిచేయడంతో తల్లీకొడుకులకు స్వల్ప గాయాలయ్యాయి. సీసీ కెమెరాలు ఉండడంతో ముగ్గురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించి తల్లీకొడుకులపై దాడి చేసినట్లు రికార్డైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రేన్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయాల పాలైన సన్యాశి రావుకు ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్యులు

గజపతినగరం: మండల కేంద్రంలో జాతీయ రహదారి వద్ద గురువారం సాయంత్రం క్రేన్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పురిటిపెంట మామిడి బంద కాలనీకి చెందిన బి.సన్యాశిరావు(40), రైల్వే న్యూకాలనీకి చెందిన లెంక హరి బాబు(25)లు సైకిల్‌పై జాతీయ రహదారి మీదుగా ప్రయాణిస్తుండగా అదే రహదారిలో ప్రయాణిస్తున్న క్రేన్ వారి సైకిల్‌ను బలంగా ఢీకొట్టడంతో కిందపడి గాయాల పాలయ్యారు. దీంతో గమనించిన స్థానికులు, గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక వైద్య చికిత్స అనంతరంవిజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై గంగరాజు క్రేన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బుచ్చమ్మ

పార్వతీపురంటౌన్: గుమ్మలక్ష్మీపురం మండలం కొండవాడ గ్రామంలో మనస్తాపంతో ఓ వృద్ధురాలు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం. బుచ్చమ్మ కొడుకుల వద్ద ఉంటూ కొండపోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగించేది. నాలుగు నెలలుగా ఆరోగ్యం సహకరించక ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యం సహకరించడం లేదని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగేసింది. గమనించిన కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మేటివ్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

- అక్టోబర్ 3 నుంచి పాత విధానంలో నిర్వహణ
- ప్రధానోపాధ్యాయుల ఈమెయిల్‌కు ప్రశ్నపత్రాలు
- పరీక్షలు రాయనున్న 1,18,000 మంది విద్యార్థులు



పార్వతీపురం పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)

పార్వతీపురంటౌన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వెలికి తీసేందుకు నిర్వహించే ఫార్మేటివ్-2 పరీక్షలు అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు గత నెల1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన విషయం విదితమే. వచ్చే నెల మూడవ తేదీన ప్రారంభమయ్యే పరీక్షలను 6వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి ప్రశ్నపత్రం ద్వారానే పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. ఫార్మేటివ్-1 పరీక్షను క్లాస్‌రూమ్ బేస్డ్ విధానంలో ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా, ఫార్మేటివ్ -2 పరీక్షలు పాత విధానంలో నిర్వ హించనున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

పార్వతీపురం మన్యం జిల్లాలో 1,694 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. 1-5 తర గతుల వరకు ప్రభుత్వ యాజమాన్యంలో మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 46,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6-10 తరగతుల వరకు ప్రభుత్వ యాజమాన్యంలో 72,000 మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 37,486 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్‌లో ముఖ్యాంశాలు

ఎఫ్ఎ-2 పరీక్షలు అక్టోబర్ 3,4 తేదీల్లో 1-5 తరగతి వరకు విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తారు. 3న తెలుగు, గణితం, 4న ఈవీఎస్, ఇంగ్లిష్ పరీక్షలు నిర్వహిస్తారు. 5న 3-5 తరగతుల విద్యార్థులకు ఓఎస్ఎస్సీ పరీక్ష ఉదయం నిర్వహిస్తారు. 6,7,8 తరగతుల విద్యార్థులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్సీ-1, ఓఎస్ఎస్సీ-2 పరీక్షలు నిర్వహిస్తారు. 9,10 తరగతులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ ఎస్సీ-1, ఓఎస్ఎస్సీ-2 పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 10.30, మధ్యాహ్నం 1.20 నుంచి 2.20 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. 3,4,5 తరగతులకు ఇంగ్లిష్ పార్ట్-బి మధ్యాహ్నం 2.30 నుంచి 2.50 గంటల వరకు నిర్వహించనున్నారు. 6-8 తరగతులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు ఒక పరీక్ష, 2.20 నుంచి 3.20 గంటల వరకు ఒక పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్ పార్ట్ -బి మాత్రం 3.30 గంటల నుంచి 3.50 గంటల వరకు నిర్వహిస్తారు. 9,10 తరగతులకు ఉదయం 9.30 నుంచి 10.15, రెండో పరీక్ష ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ పార్ట్-బి ఉదయం 11.30 నుంచి 11.50 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రాన్ని బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాయగా, విద్యార్థులు నమోదు చేసుకుని, సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఎఫ్ఎ-2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్లను సరఫరా చేయడం లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను మెయిల్‌లో పంపిస్తారు. ఆ పేపర్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది.

ఈ ఒక్క పరీక్ష మాత్రమే



ఫార్మేటివ్-2 ప్రశ్నపత్రాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ-మెయిల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఒక్క పరీక్ష మాత్రమే ఈ విధంగా నిర్వహించేలా ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఆదేశాలు వచ్చాయి. మిగిలిన అన్ని పరీక్షలను ప్రింటెడ్ పేపర్ల సహాయంతో నిర్వహించనున్నారు.

– సామల సింహాచలం, ఎంఈఓ సంఘం అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం జిల్లా

పొరపాట్లకు తావు లేకుండా..



ఫార్మేటివ్-1 పరీక్ష నిర్వహించిన మాదిరిగానే ఫార్మేటివ్-2 పరీక్షను సక్రమంగా నిర్వహించాలి. పాఠశాలల హెచ్ఎంలు ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా నిర్వహించాలి. ఏ విధమైన పొరపాట్లు తలెత్తినా వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఫార్మేటివ్-2 పరీక్షలు పాత విధానంలోనే నిర్వహిస్తున్నాం. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే సమాచారం అందించాం. పేపరు డౌన్‌లోడ్ చేసుకుని నిర్వహించాల్సిన విషయంపై కూడా అవగాహన కల్పించాల్సిందిగా ఎంఈఓలకు సూచించాం.

– ఎస్. ప్రేమ్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల పరిశీలన



హైవే పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

జామి: మండలకేంద్రం జామిలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి హైవే పనులను ఆర్డీఓ సూర్యకళ గురువారం పరిశీలించారు.హైవేకు భూసేకరణకు సంబంధించి ఏమైనా బిల్లులు అందవలసి ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో రైతులకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, రీసర్వే డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో..

కొత్తవలస: రాయపూర్-విశాఖపట్నం(గ్రీన్‌ఫీల్డ్ హైవే) నిర్మాణంలో భాగంగా కొత్తవలస మండలంలోని చిన్నిపాలెం, లక్కవరపుకోట మండలం నిడుగట్టు గ్రామాల సమీపంలో గల వీరాంజనేయసాగర్ చెరువు ముంపు ప్రాంతాన్ని విజయనగరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా పంట కాలువ మళ్లింపు వల్ల తమ పంటలు మునిగిపోయే అవకాశం ఉందని రైతులు ఈ సందర్భంగా చెప్పారు. ఈ కాలువను ఏ విధంగా నిర్మిస్తే రైతులకు నష్టం ఉండదో అరీతిలో సర్వే నిర్వహించాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆర్డీఓ ఈ మేరకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసమిశ్రా, ఆర్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా పరీక్షలు

- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రజలందరినీ ఆరోగ్య వంతులుగా రూపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 30వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం, మున్సిపాలిటీలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని వీటిని జిల్లా ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ప్రతి మండలంలో రోజు విడిచి రోజు హెల్త్, వెల్‌నెస్ సెంటర్ స్థాయిలో ఈ శిబిరాలను నిర్వహిస్తారని, పీహెచ్‌సీల వైద్యులతోపాటు చిన్నపిల్లలు, స్త్రీల ఆరోగ్యం సమస్యలకు చెందిన వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన ప్రత్యేక వైద్య నిపుణులు ఈ శిబిరాలకు హాజరై ఆయా వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేస్తారని వెల్లడించారు. శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు పద్నాలుగు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని, వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులు కూడా అక్కడే అందజేస్తామని పేర్కొన్నారు. వైద్య పరీక్షల సందర్భంగా తదుపరి స్థాయిలో చికిత్సలు అవసరమని వైద్యులు సిఫార్సు చేసినట్లయితే అటువంటి వారికి వ్యాధి పూర్తిగా నయమయ్యే వరకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా తదుపరి చికిత్స అందించేలా జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి, ఆ ప్రాంత వైద్యాధికారి నిరంతర పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, వైద్యాధికారులతో గురువారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. టెలికాన్ఫరెన్స్‌లో జేసీ మయూర్ అశోక్, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, విజయనగరం మున్సిపల్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు

విజయనగరం క్రైమ్: స్థానిక అయ్యన్నపేట జంక్షన్‌లో లక్ష్మీనారాయణ కల్యాణ మంటపం సమీపంలో రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న పల్సర్, రాయల్ ఎన్‌ఫీల్డ్‌లు గురువారం రాత్రి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు వాహనచోదకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరూ గంట్యాడ మండలం కొటారుబిల్లి, తామరాపల్లి గ్రామాలకు చెందిన వారు. విషయం తెలుసుకున్న పట్టణ డీఎస్పీ గోవిందరావు, ఎస్సైలు అశోక్, మురళిలు సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన పాడుగు అనిల్ జెడ్పీ చైర్మన్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో జెడ్పీచైర్మన్ సిబ్బంది ఆస్పత్రికి వచ్చి మెరుగైన వైద్యంకోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ మరో వ్యక్తి అశోక్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు అశోక్, మురళి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

గంట్యాడ: మండలంలోని జగ్గాపురం గ్రామాని చెందిన పున్నపు రెడ్డి లక్ష్మి (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని అంబికా స్వీట్స్, బేకరీలో లక్ష్మి పనిచేస్తోంది. ప్రతి రోజూ గ్రామం నుంచి బైక్‌పై వెళ్లి వస్తుంది. బుధవారం రాత్రి 8 గంటల వరకు ఆమె రాక పోవడంతో భర్త మహేష్ ఫోన్‌చేసి ఇంటికి ఇంతవరకు ఎందుకు రాలేదని అడగ్గా వచ్చేస్తున్నానని చెప్పింది. అయినప్పటికీ రాత్రి 9 గంటల వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో నరవ వైన్‌షాపు దాటిన తర్వాత 100 మీటర్ల దూరంలో లక్ష్మి మృతదేహమై కనిపించింది. ఆమె బైక్ కూడా పక్కన పడి ఉంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లక్ష్మి కన్నవారికి విషయం తెలియజేయడంతో వారు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ కుమార్తె లక్ష్మికి, భర్త మహేష్‌తో గొడవలు జరుగుతున్నాయని, అల్లుడే హత్య చేసి ఉంటాడని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు0 చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు. మృతురాలికి 12 సంవత్సరాల బాబు, 10 ఏళ్ల పాప ఉన్నారు.

గుర్తు తెలియని వ్యాహనం ఢీకొని వ్యక్తి..

భోగాపురం: మండలంలోని సవరవిల్లి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సవరవిల్లి గ్రామానికి చెందిన బండారు సూర్యారావు(57) భార్య సూరమ్మతో పాటు ఇద్దరు కూమారులతో కలిసి సవరవిల్లి జాతీయరహదారి పక్కన టిఫిన్ హోటల్ పెట్టుకుని కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సూర్యారావు బుధవారం రాత్రి హోటల్ మూసి ఇంటికి వెళ్లే సమయంలో జాతీయ రహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న గుర్తు తెలియని వ్యాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం అందుకున్న 108 సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుని భార్య సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

చోరీని అడ్డుకున్న మహిళకు గాయం



స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న ఎస్సై

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన ఓ యువతి మెడలో గొలుసును అపహరించే ప్రయత్నంలో అడుకోవడంతో ఆమె మెడకు గాయమవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలిలా ఉన్నాయి. శృంగవరపుకోటలోని చింతావీధికి చెందిన సరిపల్లి రోజా ఇంట్లో ఉండగా బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఓ ఆగంతుకుడు ప్రవేశించి ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసుకు తెచ్చేందుకు ప్రయత్నించగా ఆమె అడ్డుకుంది. ఈ క్రమంలో ఆగంతుకుడు మెడపై కత్తి పెట్టడంతో ఆమె కేకలు వేయగా పారిపోయాడు. ఈ ఘటనలో రోజా మెడకు గాయం కావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. సమాచారం మేరకు ఎస్.కోట ఎస్సై తారకేశ్వర్రావు చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీరామ్మూర్తి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: సృతసాయిబాబా వారి సేవా స్ఫూర్తితో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, గత 25 ఏళ్లుగా ప్రతి సంవత్సరం సాయిబాబా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచి తంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఎ. శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడుతూ పేదలకు వైద్య సహాయం అందించాలన్న సంకల్పంతో పేద రోగులకు నవంబర్ 11 వతేదీ వరకు 98 మేజర్ ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అక్కెన శ్రీకర్, డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వానికి 200 రోజులు

- కేక్ కట్ చేసి, 500 మంది వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేసిన రాజన్న దొర



వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న రాజన్నదొర



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర తదితరులు

మక్కువ: సాలూరు నియోజకవర్గం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నాటికి 200 రోజులు పూర్తి చేసుకున్నట్లు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. ఈ సందర్భంగా శంబర గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో భాగంగా ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మావుడి సోదరులు మావుడి శ్రీనివాసరావు, మావుడి రంగునాయుడు కేక్ కట్ సంబరాలు జరుపుకున్నారు. 500 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు , లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజన్న దొర మాట్లాడుతూ జిల్లా పెద్దలు, మండల పెద్దల సహాయ సహకారాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పోలమాంబ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అమ్మవారి దయవలన 200 రోజులు దిగ్విజయంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తి చేసుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలమమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, శంబర పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర డైరెక్టర్ సీహెచ్ రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీనివాసరావు, చప్ప సూర్యనారాయణ, కొత్తూరు శంకరరావు, కోట్ల నారాయణరావు, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలవాలి

- స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ
- అండర్-17 రాష్ట్ర పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల పయనం



బాలికల జట్టు



రాష్ట్ర స్థాయిలో జరగనున్న హ్యాండ్‌బాల్ పోటీలకు పయనమవుతున్న జిల్లా బాలుర జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ అండర్-17 బాల, బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి విజయనగరం జిల్లా జట్లు అద్వితీయమైన ప్రదర్శనతో విజేతలుగా తిరిగిరావాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ఆకాంక్షించారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు తెనాలిలోని ఏఎస్ఎన్ స్టేడియంలో అండర్ -17 విభాగంలో జరగనున్న హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు గురువారం పయనమయ్యాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎల్‌వీ రమణ, డీటీ.గాంధీలు క్రీడాకారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అంతర్ జిల్లాల పోటీలకు సంబంధించిన 16 మంది బాలుర జట్టు, 16 మంది బాలికల జట్టు పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

- సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్



సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం: డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో గల రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశాల కోసం వచ్చే నెల 3,4 తేదీల్లో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామ్ గోపాల్ గురువారం తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హకీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడాంశాల్లో విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో 12 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు ఫోన్ 9177070098 నంబర్‌ను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

నైరేడ్‌ను సందర్శించిన డైరెక్టర్



శిక్షణార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ విశ్వనాథరెడ్డి

రాజాం: రాష్ట్ర గ్రామీణ స్వయం ఉపాధి సంస్థల (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఇనిస్టిట్యూట్స్) రాష్ట్ర సంచాలకుడు పి.విశ్వనాథరెడ్డి రాజాం నైరేడ్ సంస్థను గురువారం సందర్శించారు. నైరేడ్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. అభ్యర్థులతో ముఖాముఖి నిర్వహించి శిక్షణా నైపుణ్యాలపై ఆరాతీశారు. రికార్డులు పరిశీలించడంతో పాటు వసతుల వివరాలు సేకరించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ యూనియన్‌బ్యాంకు సహకారంతో జీఎంఆర్ నైరేడ్ సంస్థ నిరుద్యోగ యువతీయువకులకు ఇస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణ చాలా గొప్పదని ప్రశంసించారు. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున శిక్షణ ఇస్తున్న సంస్థ ఒక్క రాజాంలో మాత్రమే ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. మంచి నైపుణ్యంతో కూడిన శిక్షణతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువల బోధన వేలాదిమంది నిరుద్యోగులకు కొత్త జీవితాన్ని ఇస్తుందదన్నారు. అనంతరం గతంలో ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థుల గ్రామాలకు వెళ్లి ఆరాతీశారు. ఈ శిక్షణ ఎలా వినియోగపడుతోందనే అంశంపై దర్యాప్తు చేసి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీఎం సి.నాగరాజు, నైరేడ్ డైరెక్టర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు రక్షణ 'దిశ'



విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై లావణ్య

పాలకొండ రూరల్: ఆపద సమయంలో దిశయాప్ అండగా నిలుస్తుందని, ప్రతి విద్యార్థిని తమ మొబైల్ ఫోన్‌లో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని దిశ ఎస్ఐ లావణ్య సూచించారు. పాలకొండ ఎస్టీ బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహాన్ని గురువారం సందర్శించారు. విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. పోకిరీలు, అపరిచితుల నుంచి సమస్యలు ఎదురైతే వెంటనే దిశ యాప్‌లో పోలీసులకు సమాచారం అందిస్తే క్షణాల్లో రక్షణ కల్పిస్తారన్నారు.

పాఠశాలపై ఏనుగులదాడి



ఏనుగుల దాడితో చిందరవందరగా పడి ఉన్న స్కూల్‌లోని ఫర్నీచర్

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలసలో ఉన్న శ్రీసత్యసాయి క్లాస్ పాఠశాలపై ఏనుగులు గురువారం దాడిచేశాయి. తరగతి గదుల్లో ఉన్న బెంచీలను చిందరవందర చేశాయి. సెలవుదినం కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పొలాల్లో సంచరిస్తూ గ్రామాల్లోకి చొరబడుతున్నాయని, ఏనుగుల తరలింపునకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సోంపురంలో పశలమ్మ పండగ

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో గురువారం సాయంత్రం పశలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఏటా వరి ఉభాలు పూర్తయిన తర్వాత పశలమ్మ పండగ నిర్వహించడం ఆనవాయితీ. మంగళవాయిద్యాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అమ్మవారి ఉదకాన్ని పశువులపై చల్లారు. ఉదకం చల్లడంవల్ల పశువులు ఆరోగ్యకరంగా ఉంటాయన్నది నమ్మకం.